దేవేందర్‌రావు ఇంటి వద్ద గుమిగూడిన గ్రామస్తులు

బురహాన్‌పల్లిలో భయం భయం..

- గ్రామంలో కలకలం రేపిన మాజీ సర్పంచ్ దేవేందర్‌రావు హత్య
- ఆగంతకుల ఆచూకీ కోసం పోలీసుల ముమ్మర వేట

రాయపర్తి, జూలై 9: మాజీ సర్పంచ్ హత్యతో బురహాన్‌పల్లి వాసుల్లో భయం నెలకొంది. గ్రామాన్ని ఐదేళ్లపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ రావు అలియాస్ బోరుబండి దేవన్న అర్ధరాత్రి దారుణ హత్యకు గురి కావడాన్ని జీర్ణించుకోలేని గ్రామస్తులు ఆయన కడసారి చూపు కోసం ఎదురుచూస్తూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దేవేందర్‌రావు హత్యోదంతం తెలియగానే అమెరికాలో ఉన్న మృతుడి భార్య సూదుల ఉమాదేవి, కుమార్తె అశ్విని కుటుంబ సభ్యులు ఇండియాకు బయల్దేరారు. దీంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారు.

పోలీసుల అదుపులో నిందితులు?

వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఆగంతకుల కోసం వర్ధన్నపేట సబ్ డివిజన్‌లోని పోలీసులు బృందాలుగా విడిపోయి ముమ్మరంగా వేట సాగిస్తున్నట్లు తెలిసింది. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ జీడి సూర్యప్రకాశ్, రాయపర్తి ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ సారథ్యంలో వర్ధన్నపేట, జఫర్‌గఢ్ మండలాల ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రవి, రాజుతో కూడిన పోలీస్ బలగాలు హంతకుల ఆచూకీ కనుగొనేందుకు ముమ్మర వేట సాగిస్తున్నారు. మృతుడి కుమారుడు నితిన్‌రావు ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన పల్లె మల్లేశ్, గతంలో అతడి వద్ద పని చేసిన మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. ఆగంతకుల ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు.

కాగా, దేవేందర్‌రావు హత్యలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పల్లె మల్లేశ్ కుమారుడు మురళిని పట్టుకునేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

దీర్ఘకాల వరి సాగు ఆమోదయోగ్యం కాదు

- ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలే మేలు
- నర్సంపేట ఏడీఏ డాక్టర్ కేసరి నగేశ్

నర్సంపేట, జూలై 9: ప్రస్తుత పరిస్థితుల్లో దీర్ఘకాల వరి రకాల సాగు ఆమోదయోగ్యం కాదని నర్సంపేట ఏడీఏ డాక్టర్ కేసరి నగేశ్ తెలిపారు. ఇప్పటివరకు కురిసిన వర్షాలు కేవలం మక్కజొన్న, పత్తి పంటలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. కానీ, రైతులు వరి నారుమడులను తయారు చేసుకుని నార్లు పోస్తున్నారని తెలిపారు. డివిజన్‌లో వరి సాగుకు అనువైన వర్షపాతం నమోదు కాలేదన్నారు. అన్నదాతలు స్వల్పకాలిక వరి సాగుకు సిద్ధం కావాలని కోరారు. వరిలో స్వల్పకాలిక రకాలు సాగు చేయడం వల్ల త్వరగా కోతకు వస్తుందని వివరించారు. తెలంగాణ సోనా, వరంగల్ వరి, కులనరం 2, వరంగల్ వరి 2, జగిత్యాల సాంబ, ఎర్రమల్లెలు, కలవరం వరి రకాలు ప్రస్తుత పరిస్థితుల్లో సాగుకు అనుకూలమైనవన్నారు. జూలై 20 వరకు ఈ రకాల నార్లు పోసుకోవడానికి అనుకూలమన్నారు. డివిజన్‌లోని రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తగిన రకాలను ఎంచుకుని సాగు చేయాలని ఆయన సూచించారు.

భూ నిర్వాసితులను ఆదుకుంటాం

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఖిలావరంగల్, జూలై 9: మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ మండలంలోని గాడిపల్లి పరిధిలో భూములు కోల్పోతున్న రైతులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తొలిదశలో విమానాల రాకపోకలకు వీలుగా భూమిని సేకరించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పరిహారం తక్కువ వస్తుందని రైతుల ఆవేదనను సీఎం దృష్టికి తీసుకువెళ్లి నాయ్యం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాడిపల్లిలో సుమారు 12 ఇండ్లు కోల్పోతున్నాయని, బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. సమావేశంలో 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు, ఖిలావరంగల్ తహసీల్దార్ బీ నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లాభవానీ వేడుకలు

నర్సంపేటరూరల్/ఖానాపురం/పర్వతగిరి, జూలై 9: గ్రామాలు, తండాల్లో మంగళవారం గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లాభవానీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాకాలరోడ్‌లో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాటోత్ జేతు రామ్‌నాయక్, డాక్టర్ ఉదయ్‌సింగ్, ఆంగోత్ భద్రయ్య ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. అలాగే, రాములునాయక్‌తండాలో మాజీ సర్పంచ్ ఆంగోత్ సుధాకర్‌లాల్, తండా పెద్దమనిషి ఆంగోత్ పూల్యానాయక్, వెంకయ్య, వీరు, నర్సయ్య, చందర్, యాకూబ్, రాజ్యు, స్వామి, చిరంజీవి, వినోద్‌ల ఆధ్వర్యంలో, ఆకులతండాలో మాజీ సర్పంచ్‌లు బానోత్ రాము, కిషన్, ముత్యాల మ్మతండాలో మాజీ సర్పంచ్ భూక్యా సైద ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం గొడ్ల దాటే కార్యక్రమాన్ని నియమనిష్టలతో నిర్వహించారు. అంతేకాకుండా ఖానాపురం మండలవ్యాప్తంగా గిరిజనులు సీత్లాభవానీ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. గ్రామ పొలిమేరల్లో ఉన్న సీత్లాభవానీకి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం నృత్యాలు చేశారు. నాజీతండాలో జరిగిన వేడుకల్లో మాజీ సర్పంచ్ బాలకిషన్ పాల్గొన్నారు. పర్వతగిరి మండలం పెద్ద తండా జీపీ పరిధిలోని గిరిజన తండాల్లో సీత్లాభవానీ వేడుకలను కనులపండువగా జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ కమల పంతులు ముఖ్య అతిథిగా హాజరై సీత్లాభవానీ అమ్మ వారి విగ్రహాలు చేయించి గిరిజనులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఎల్ భిక్షానాయక్, మాజీ సర్పంచ్ లునావత్ గణేశ్, రూప్లానాయక్ పాల్గొన్నారు.

నర్సంపేటరూరల్: నర్సంపేటలోని పాకాలరోడ్డులో వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బంజారాహిల్స్-2 శాఖ (11051):
#1 రిలయన్స్ క్లాసిక్ జిఎల్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034,
ఇమెయిల్: ubin0811050@unionbankofindia.bank

(రూల్-8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బంజారాహిల్స్-2 శాఖ** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 1,05,58,459.11 (ఒక కోటి ఐదు లక్షల యాభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది రూపాయల పదకొండు పైసల మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత మెసర్స్ హరిణి ట్రేడింగ్ కంపెనీ (భాతా: 110515010000005, ప్రాతినిధ్యం వహించువారు 1. శ్రీ పాశం చెన్నారెడ్డి తండ్రి శ్రీ పాశం జమలా రెడ్డి (మేనేజింగ్ పార్టనర్), 2. శ్రీ బుజుగుండ్ల రాజేంద్ర కుమార్ తండ్రి శ్రీ మహాదేవ్ బుజుగుండ్ల (పార్టనర్) మరియు 3. శ్రీ బుజుగుండ్ల రవీందర్ కుమార్ తండ్రి మహాదేవ్ బుజుగుండ్ల (గ్యారంటార్)** వారిని కోరుతూ 27-03-2024 తేదీగల డిమాండ్ నోటీసు (ప్రతికా ప్రచురణ తేదీ: 24.04.2024) జారీచేశారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **05 జూలై, 2024న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు **రూ. 1,05,58,459.11 (ఒక కోటి ఐదు లక్షల యాభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది రూపాయల పదకొండు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ కలిపి సదరు మొత్తం కొరకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బంజారాహిల్స్-2 శాఖ** యొక్క చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

శ్రీ బుజుగుండ్ల రాజేంద్ర కుమార్ తండ్రి మహాదేవ్ బుజుగుండ్ల మరియు శ్రీ బుజుగుండ్ల రవీందర్ కుమార్ తండ్రి మహాదేవ్ బుజుగుండ్లకు చెందిన, రెడ్డి కాలనీ, హనుమకొండ, వరంగల్, తెలంగాణ-506001 వద్ద గల, మున్సిపల్ నెం.3/704 మరియు 3/705 (పాతది) 3-10-31 (కొత్తది) కలిగిన ఇల్లు, 355.00 చ.గజాలు లేదా 297.28 చ.మీటర్లు విస్తీర్ణం మొత్తంతో కలిపి నిర్మించబడిన నివాస ఇల్లు యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: కె.దశరథం ఇల్లు, దక్షిణం: పి.ఎల్లయ్య ఇల్లు, తూర్పు: మున్సిపల్ లేన్, పడమర: మున్సిపల్ రోడ్.

తేది: 05-07-2024
ప్రదేశం: వరంగల్
సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వరద ముంపు నివారణకు పటిష్ట చర్యలు

- నాలాల విస్తరణకు డీపీఆర్ రూపొందించాలి
- మేయర్ గుండు సుధారాణి
- ఈఎన్‌సీ, కమిషనర్‌తో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటన

వడ్డేపల్లి బండ్‌ను పరిశీస్తున్న మేయర్, ఈఎన్‌సీ, కమిషనర్

వరంగల్, జూలై 9: గ్రేటర్‌లో వరద ముంపును ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ జియాఉద్దీన్, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి గ్రేటర్‌లోని పలు ముంపు ప్రాంతాల్లో మేయర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. వడ్డేపల్లి బండ్, జవహర్‌కాలనీ, అంబేద్కర్‌భవన్, హనుమకొండ బస్‌స్టేషన్, ములుగురోడ్డు, ప్రభుత్వ ఐటీఐ, కొత్తవాడ, కాశీబుగ్గ, పద్మనగర్‌లో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈఎన్‌సీకి మేయర్ వివరించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ జియాఉద్దీన్ మాట్లాడుతూ వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలు ఎంత విస్తీర్ణం ఉండాలో డిజైన్ చేసి డీపీఆర్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, హనుమకొండ బస్‌స్టేషన్, అంబేద్కర్ భవన్, ములుగు రోడ్, పోచమ్మమైదాన్ ప్రాంతాల్లో నూతన సాంకేతికతను వినియోగించి నీటి సంపుల నిర్మాణం చేసేందుకు యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించాలన్నారు. వడ్డేపల్లి బండ్ పటిష్టత గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాకరాశికుంటపై నుంచి వచ్చే వరద నీరు పోతన నగర్ మీదుగా వెళ్లడానికి కన్సల్టెంట్‌ను నియమించి, డిజైన్ చేయించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని నాలాల లెవల్స్ సమానంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మ్యూజికల్ గార్డెన్‌పై నుంచి వచ్చే నాలా వెడల్పు చేసేలా డీపీఆర్ రూపొందించాలని, నాలాపై ఆక్రమణలు తొలగించి, తాత్కాలికంగా కచ్చా నాలా ద్వారా వరద నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ కృష్ణారావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, అజ్మీరా శ్రీకాంత్, ఏఈలు, జీడబ్ల్యూ ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

కాశీబుగ్గ, జూలై 9: మ్యానిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

గంజాయి దహనం

సుబేదారి, జూలై 9: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 1.30 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు దహనం చేశారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగం ఆదేశాల మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగర శివారు అమ్మవారిపేటలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఎనుమాముల ఎస్సై నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సాధికార సంఘం రాష్ట్ర కార్యదర్శిగ ప్రభాకర్

ఖిలావరంగల్, జూలై 9: తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొయ్యాడ(కరాటే) ప్రభాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రతాని రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 133 బీసీ కులాల ఐక్యతకు కృషి చేస్తాననే నమ్మకంతో తనకు ఈ పదవిని ఇచ్చారని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

గుణపాఠం చెప్పినా మారని మోదీ వైఖరి

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాని
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కాశీబుగ్గ, జూలై 9: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా మోదీ ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కొత్తవాడలో మంగళవారం సీపీఐ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లే గత లోకసభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. దేశంలో పదేళ్లపాటు మోదీ రాజ్యాంగానికి భిన్నంగా పాలన కొనసాగించారని. ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేశారని విమర్శించారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేసి అనేక మందిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆరోపించారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నేదునూరి రాజమౌళి జ్యోతి, వరంగల్, హనుమకొండ కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, పంజాల రమేశ్, అశోక్, స్టాలిన్, షేక్‌బాష్‌మియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేశ్, గుండె బద్రి, దామెర కృష్ణ, జన్ను రవి, వేల్పుల సారంగపాణి, తాళ్లపల్లి రహెలా పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కరీమాబాద్, జూలై 9: బీరన్నకుంటలోని కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి మంగళవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు అందజేసిన దుస్తులు, పుస్తకాలను ఆమె పరిశీలించి, పిల్లలను పలు విషయాలు తెలుసుకున్నారు. అలాగే, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జిల్లాలో 43 శాతం మొక్కలు నాటాం

ఖిలావరంగల్: జిల్లాలో 43 శాతం మొక్కలు నాటినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా 438 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను గుర్తించి ఇప్పటి వరకు 232 పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా పనులను వారంలోగా వందశాతం పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కుడా చైర్మన్

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి కలెక్టర్ సత్య శారదాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ ఇనుగాలకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలల అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నర్సంపేట, జూలై 9: బాలల అక్రమ రవాణా నిర్మూలనకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. నర్సంపేటలోని ఏసీపీ కార్యాలయంలో స్వయంకృషి సోషల్ నెట్ వర్క్స్, ఎఫ్ ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. మానవ, బాలల అక్రమ రవాణా నేరమన్నారు. ముఖ్యంగా మహిళలు, ఆడపిల్లలే ఎక్కువగా అక్రమ రవాణాకు గురువుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బెదిరించడం, బలవంతం చేయడం, అధికార దుర్వినియోగం, అపహరించడం, అక్రమ రవాణాను ప్రేరేపించడం చట్టరీత్యా నేరమని వివరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీస్ హెల్ప్‌లైన్ 100, చైల్డ్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బెజ్జంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

నర్సంపేట, జూలై 9: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని నర్సంపేట 9వ వార్డు కౌన్సిలర్ రాయిడి కీర్తి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సంజయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కౌన్సిలర్ పరీక్ష ప్యాడ్స్, జామెట్రి బాక్స్‌లు, కలర్ పెన్సిల్ బాక్స్‌లు, పెన్సిళ్లు, స్కేళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం హెచ్ఎం కేశవరెడ్డిని సన్మానించారు. గిరినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వన్‌వే ట్రాఫిక్ ఎత్తివేతపై హర్షం

గిర్మాజీపేట, జూలై 9: వరంగల్ చౌరస్తా నుంచి ఎస్వీఎన్‌రోడ్ ఆంధ్రా బాలికల కళాశాల వరకు ఉన్న వన్‌వే ట్రాఫిక్ ఎత్తివేతపై వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వరంగల్‌చౌరస్తాలో ది వరంగల్ బులియన్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ హరీశ్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత సివిల్స్ శిక్షణకు రేపే చివరి గడువు

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం ద్వారా యూపీఎస్‌సీ, సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీఎస్ఏటీ) కోసం అందించే ఉచిత శిక్షణకు బుధవారం చివరి గడువు అని, అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్‌మోహన్ తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించకుండా ఉన్నవారు http://tsstudycircle.c o.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా ప్రవేశం కల్పించి, ఉచిత వసతి భోజనంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

'భరోసా ఇవ్వని కాంగ్రెస్'

చెన్నారావుపేట, జూలై 9: వర్షాకాలం ప్రారంభమైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించలేదని రైతు బంధు సమితి అమీనాబాద్ గ్రామ కన్వీనర్ అమ్మ రాజేశ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి అన్ని విధాలా ఆదుకున్నారని తెలిపారు. సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించే వారని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ సర్కారు ఎకరానికి రూ. 10 వేలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15 వేలు ఇస్తామని అబద్ధపు హామీలతో రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలని, లేదంటే రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కురుకుల్లా మాతగా భద్రకాళీ

నాలుగో రోజు శాకంబరీ ఉత్సవాలు

వరంగల్, జూలై 9 : భద్రాకాళీ ఆలయంలో శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం ఉదయం భద్రకాళీ అమ్మవారు కురుకుల్లా మాతగా, సాయంత్రం భేరుండా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు

13 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

కాశీబుగ్గ, జూలై 9: ఈ నెల 13 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సెమిస్టర్ సైన్స్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించనున్నట్లు దేశాయిపేటలోని సీకేఎం డిగ్రీ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్.అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిదర్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరంగల్(227), ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబాబాద్(105), ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొర్రూరు(187), నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 229 మంది విద్యార్థులు మొదటి సెమిస్టర్ కెమిస్ట్రీ, జువాలజీ, గణితం, ఫిజిక్స్, బాటని, స్టాటిటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్లు చదివే విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావాలని కోరారు. 70 శాతం హాజరు లేని వారికి అనుమతి లేదని పేర్కొన్నారు.

బాధ్యతగా విధులు నిర